
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు
మంగళవారం 9 జూలై 2024



11న ముఖ్యమంత్రి చంద్రబాబు రాక?



విశాఖపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 11వ తేదీన నగరానికి రానున్నట్టు తెలిసింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా విశాఖ వస్తున్న ఆయన మెడ్‌టెక్ జోన్‌ను సందర్శించి నిపుణులు, ఉద్యోగులు, సంస్థల ప్రతినిధులతో సమావేశమవుతారు. అనంతరం అనకాపల్లి కూడా వెళ్లే అవకాశం ఉందంటున్నారు. అయితే సీఎం పర్యటనను ఇంకా అధికారులు ధ్రువీకరించలేదు.

వేరుశనగతో లాభాల పంట

- సాగుపై గిరి రైతుల ఆసక్తి
- ఎకరాకు రూ.వెయ్యి ఖర్చు
- మూడు నెలల్లో రూ.9 వేలు ఆదాయం
- లాభాలు వస్తుండడంతో పెరుగుతున్న విస్తీర్ణం
- ఏజెన్సీ వ్యాప్తంగా 2,000 ఎకరాల్లో పంట సాగు



ఏపుగా పెరిగిన వేరుశనగ మొక్కలు

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

మన్యంలో వేరుశనగ పంట రైతులకు లాభాలు కురిపిస్తున్నది. దీంతో ఆ పంటను సాగు చేసేందుకు గిరిజన రైతాంగం ఆసక్తి చూపుతున్నది. ఫలితంగా ఏజెన్సీలో వేరుశనగ విస్తీర్ణం ప్రతి ఏటా పెరుగుతోంది.

గిరిజన ప్రాంతంలో గతంలో వేరుశనగ పంట ఉండేది కాదు. కాని చింతపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తల ప్రోత్సాహంతో జీకేవీధి, చింతపల్లి మండలాల్లో కొంతమంది రైతులు మాత్రమే పండించేవారు. క్రమేణ ఏజెన్సీలో అన్ని మండలాల్లోనూ గిరి రైతులు వేరుశనగను పండిస్తున్న పరిస్థితి నెలకొంది. నాలుగేళ్ల క్రితం వరకు ఏజెన్సీ వ్యాప్తంగా కేవలం 400 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసే ఈ పంట ప్రస్తుతం 2 వేల ఎకరాలకు పెరిగింది. తక్కువ కాలంలో పంట చేతికి రావడంతోపాటు ఎక్కువ శ్రమ, పెట్టుబడి లేని కారణంగా గిరి రైతులు వేరుశనగ పంటపై ఆసక్తి చూపుతున్నారని వ్యవసాయాధికారులు అంటున్నారు.

అలాగే వేరుశనగ పంటలో బంతి, మొక్కజొన్న వంటి వాటిని అంతర పంటలుగా వేస్తున్నారు. దీంతో ఏకకాలంలో రెండు పంటలు దిగుబడి వచ్చి రైతులకు చక్కని ఆదాయం లభిస్తున్నది. ప్రస్తుతం ఏజెన్సీలో పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల, డుంబ్రిగుడ, చింతపల్లి, జీకే వీధి మండలాల్లో అధిక విస్తీర్ణంలో వేరుశనగను పండిస్తున్నారు. గిరిజనులు స్థానికంగా జరిగే వారపు సంతల్లోనే బస్తాల చొప్పున వర్తకులకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఏజెన్సీలో 50 కిలోల బస్తా రూ.1,600 ధర ఉంది.

ఎకరా సాగుకు రూ.వెయ్యి ఖర్చు

ఏజెన్సీలో ఎకరం భూమిలో వేరుశనగ పంటను పండించేందుకు కేవలం రూ.1,000 మాత్రమే వ్యయం అవుతుందని రైతులు తెలిపారు. ఒక గిరిజన కుటుంబం సొంతంగా ఎకరం భూమిలో పది కిలోల విత్తనాలు చల్లుతోంది. ఒక కిలో విత్తనం రూ.80లకు లభిస్తున్నది. అలాగే 90 రోజుల్లో దిగుబడి వచ్చే ఈ పంటకు ఎటువంటి ఎరువులు, క్రిమిసంహారక మందులు వినియోగించడం లేదు. కానీ పంట కాలంలో ఒక మారు కలుపుతీసి, గొప్పు తవ్వితే సరిపోతుంది. ఎకరం విస్తీర్ణంలో పంటకు ఆరు బస్తాలు (బస్తా 50 కిలోలు) కాయలు దిగుబడి వస్తున్నాయి. ఈ లెక్కన ప్రస్తుతం ఉన్న బస్తా రూ.1,600 ధరకు రూ.50 అటూ ఇటూ ఉన్నా, కచ్చితంగా రూ.9 వేలు ఆదాయం వస్తుందని హుకుంపేట మండల మారెల గ్రామానికి చెందిన మహిళ అప్పలమ్మ తెలిపింది. ఒక గిరిజన కుటుంబం ఎకరం విస్తీర్ణంలో వేరుశనగను పండిస్తే రూ.9వేలు ఆదాయం పొందవచ్చుని రైతులు చెబుతున్నారు. అలాగే ఏజెన్సీలో వేరుశనగను సాగు చేస్తున్న గిరిజన రైతులకు వ్యవసాయ, ఉద్యానవనాధికారులు సలహాలు, సూచనలు అందిస్తే తమకు మరింత మేలు జరుగుతుందని గిరి రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



సమావేశంలో పాల్గొన్న జిల్లాలోని ఇంజనీర్లు, కాంట్రాక్టర్లనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్. చిత్రంలో ఐటీడీఏ పీవో అభిషేక్ ఉన్నారు

ఇంజనీరింగ్ పనులు వేగవంతం

- అధికారులు, కాంట్రాక్టర్ల సమావేశంలో కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశం
- పూర్తయిన పనుల బిల్లులు పెట్టాలి
- పెండింగ్ బిల్లులకు ప్రతిపాదనలు పంపాలి
- వివిధ పనుల పురోగతిపై సమీక్ష

పాడేరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న ఇంజనీరింగ్ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని పాడేరు, రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని గిరిజన సంక్షేమ, పంచాయతీరాజ్, రోడ్ల, భవనాల శాఖల ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పురోగతిలో ఉన్న పనులను మరింత వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జరిగిన పనులకు సకాలంలో బిల్లులు సమర్పించాలన్నారు. అలాగే గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో విద్యా మౌలిక సదుపాయాలు, సీసీడీపీలో చేపట్టిన పనులు, ఎస్‌సీఏ, ఆర్టికల్ 275, ప్రధానమంత్రి జన్‌మన్, ఎన్‌ఆర్‌హెచ్‌ఎం, స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణాల పురోగతి, ఎం.బుక్ రికార్డింగ్, బిల్స్ అప్‌లోడింగ్, పెండింగ్ బిల్లులపై ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఏకలవ్య మోడల్ స్కూళ్లు, గోకులం షెడ్ల నిర్మాణాలపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. అలాగే పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న రహదారుల నిర్మాణాలపై సమీక్షించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతలు పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే జరిగిన పనులకు బిల్లులు సిద్ధం చేయడంలో ఎక్కడా జాప్యం చేయకూడదని, చింతూరు డివిజన్ పరిధిలోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో రోడ్లు నిర్మాణాలు వేగంగా పూర్తిచేయాలన్నారు. ఒకవేళ పనులు సొంతం చేసుకుని చేపట్టకపోతే సదరు కాంట్రాక్టర్‌ను మార్చేసి వేరొకరి పనులు అప్పగిస్తామన్నారు.

పెండింగ్ బిల్లుల చెల్లింపునకు ప్రతిపాదనలు

కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులకు సంబంధించి ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ దినేశ్‌కుమార్ సూచించారు. అలాగే ఇప్పటివరకు జరిగిన పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు చెల్లించవలసిన పెండింగ్ బిల్లుల వివరాలను ప్రభుత్వం అడిగిందని, పెండింగ్ బిల్లులకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందన్నారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులకు అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. అలాగే కాంట్రాక్టర్లకు అప్పగించిన పనులు నిర్దిష్ట సమయానికి పూర్తిచేయాలని సూచించారు. కాంట్రాక్టర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తామన్నారు. రహదారులు, ప్రాధాన్యత భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి అప్పగించాలని, రూడకోట పీహెచ్‌సీ పరిధిలో బర్త్ వెయిటింగ్ హాలు అసంపూర్తిగా ఉందని, నిర్మాణం పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేయాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్‌కు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్, రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే (వర్చువల్), గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈలు డీవీఆర్ఎం.రాజు, కె.వేణుగోపాల్, మురళీ, పంచాయతీరాజ్ శాఖ ఈఈలు టి.కొండయ్యపడాల్, పి.శ్రీనివాసరావు, పాడేరు, రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటింటా ఆధార్ పరిశీలన

- ఆధార్ లేక పథకాలకు ప్రజలు దూరం కాకూడదు
- అధికారులకు కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, పక్కన జేసీ భావన వశిష్ఠ

పాడేరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఆధార్‌కార్డు లేని కారణంగా ప్రభుత్వ పథకాలను పొందలేదనే సమస్య తలెత్తకుండా ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డు ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశించారు. ఆధార్ కార్డుల అంశంపై జిల్లాలోని ఎంపీడీవోలు, తహసీల్దార్లతో సోమవారం కలెక్టరేట్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఆధార్‌కార్డు లేని కారణంగా అర్హులు ప్రభుత్వ పథకాలు పొందలేని దుస్థితి ఏర్పడకూడదన్నారు. సచివాలయాల్లో ఏఎన్ఎం మినహా సిబ్బంది మంగళవారం నుంచే ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టి, ఆధార్ కార్డులు లేని వాళ్లను గుర్తించాలన్నారు. చేపట్టిన సర్వే ఆధారంగా వారందరికీ ఆధార్‌కార్డుల జారీ చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అలాగే చిన్నారులకు బాల ఆధార్ నమోదు అవసరమైన పరికరాల కోసం ప్రతిపాదనలు పంపాలన్నారు. అలాగే జిల్లాలో ఆలస్యంగా జనన నమోదు చేసుకున్న 33,245 మందికి ఆధార్ నమోదుకు దరఖాస్తులు చేయగా, వారిలో 28,090 మందికి ... మిగతా 6వ పేజీలో

ఆశ్రమంలో గురువుల కొరత

- 282 మంది విద్యార్థులకు ఏడుగురు ఉపాధ్యాయులు
- ప్రధానోపాధ్యాయురాలకు డిప్యూటేషన్
- ఉన్నవారిలో ఒకరు వార్డెన్, పాఠశాల ఇన్‌చార్జి బాధ్యతలు
- మిగతా ఐదుగురు 3 నుంచి 9 తరగతులకు బోధన
- ఇంగ్లీష్, లెక్కలు టీచర్ల కొరత
- ఇదీ సీలేరు బాలికల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల దుస్థితి





సీలేరు బాలికల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో మూడు నుంచి ఆరో తరగతి వరకు ఒకే క్లాస్ రూమ్‌లో కూర్చున్న విద్యార్థినులు. (ఇన్‌సెట్లో) ఆశ్రమ పాఠశాల

సీలేరు, జూలై 8: ఆశ్రమ పాఠశాలలకు ఉపాధ్యాయుల కొరత వెంటాడుతోంది. విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తికి అనుగుణంగా అధికారులు పోస్టుల భర్తీ చేయడం లేదు. దీంతో విద్యార్థులకు అరకొర విద్యే అందుతోంది. ఉన్న ఉపాధ్యాయుల్లో డిప్యూటేషన్లు వేయడంతో చాలా ఆశ్రమ పాఠశాల్లో చదువులు కుంటుపడుతున్నాయి. ఇందుకు ఉదాహరణ సీలేరు బాలికల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల అని చెప్పవచ్చు. వివరాల్లో వెళితే..

జీకేవీధి మండలం సీలేరు బాలికల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో విద్యార్థులకు అరకొర విద్యే అందుతున్నదని తల్లిదండ్రులు ఆందోళన ఆరోపిస్తున్నారు. ఈ బాలికల ఆశ్రమ పాఠశాలలో మూడు నుంచి తొమ్మిదవ తరగతి వరకు ఉంది. పాఠశాలలో 282 మంది గిరిజన విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇక్కడ ఏడుగురు ఉపాధ్యాయులు ఉండగా.. వీరిలో ప్రధానోపాధ్యాయురాలు డిప్యూటేషన్‌పై వేరే పాఠశాలకు వెళ్లిపోయారు. మిగిలిన ఆరుగురిలో ముగ్గురు రెగ్యులర్ టీచర్లు, మరో ముగ్గురు సీఆర్‌టీలు ఉన్నారు. వీరిలో ఒకరు పాఠశాల ఇన్‌చార్జి, డిప్యూటీ వార్డెన్ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఆయనే ఆఫీస్ కార్యకలాపాలు, హాస్టల్ నిర్వహణ చేస్తున్నారు. మిగతా ఐదుగురు ఉపాధ్యాయులే మూడు నుంచి 9వ తరగతి వరకు ఉన్న 282 మంది విద్యార్థినులకు విద్యా బోధన చేస్తున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత కారణంగా మూడు నుంచి 6వ తరగతి వరకు ఉన్న విద్యార్థులందరినీ ఒకే క్లాస్ రూమ్‌లో కూర్చోబెట్టి చదువులు చెబుతున్నారు. నాలుగు తరగతులకు ఒకే రూమ్‌లో ఉంచి పాఠాలు చెబితే తమ పిల్లలకు ఏమి అర్థం అవుతుందని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఉపాధ్యాయుల కొరత వేధిస్తున్నప్పటికీ ఇక్కడ ఉన్న హెచ్ఎంను వేరే పాఠశాలకు ఎలా డిప్యూటేషన్ వేస్తారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఈ పాఠశాలలో 10వ తరగతి కూడా అప్‌గ్రేడ్ చేయాలని గిరిజన సంక్షేమశాఖాధికారులు జిల్లా విద్యాశాఖాధికారులను కోరినట్టు ఇటీవల పాఠశాల తనిఖీ చేసిన డీఈవో వెల్లడించారు. దీంతో టీచర్లు ఇక్కడ పరిస్థితిని డీఈవోకి వివరించారు.

ఇంగ్లీష్, లెక్కలు టీచర్ల కొరత

ఆశ్రమ పాఠశాలలో ఇంగ్లీషు, లెక్కల టీచర్లు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. ప్రధాన సబ్జక్టులకు ఉపాధ్యాయులు లేకుంటే ఎలాని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. టీచర్లను నియమించేటప్పుడు విద్యాశాఖాధికారులు ఈ విషయాన్ని గమనించాలని, అలా చేయకుండా ఇష్టానుసారంగా పోస్టులను భర్తీ చేస్తున్నారని వారు మండిపడుతున్నారు. ప్రస్తుతం ఉన్న కాంపిటేషన్‌లో లెక్కలు, ఇంగ్లీషు ప్రాధాన్యత ఉన్నప్పటికీ వారిని నియమించకపోవడం గిరిజన సంక్షేమశాఖ అధికారుల నిర్లక్ష్యమని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఇలా చేస్తే ఉత్తమ ఫలితాలు ఎలా వస్తాయని వారు ప్రశ్నిస్తున్నారు. గిరిజన విద్యార్థులకు ఆశ్రమ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తున్నామంటూ అధికారులు ప్రకటనలు గుప్పించడం తప్ప వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని తల్లిదండ్రులు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్, గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు స్పందించి సీలేరు బాలిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను నియమించాలని కోరుతున్నారు.

ఉత్సవ విగ్రహంలా సలుగు సచివాలయం

- సిబ్బంది లేక ప్రజలకు అందని సేవలు
- సస్పెన్షన్‌లో సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్‌లు
- సర్వేయర్‌కు డిప్యూటేషన్, లాంగ్ లీవ్‌లో వెల్ఫేర్ అసిస్టెంట్
- ఈదులపాలెం పీహెచ్‌సీలో ఏఎన్‌ఎం సేవలు
- ఫీల్డ్‌లో ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ అసిస్టెంట్లు
- పింఛన్ల పంపిణీలో జాప్యంతో ఫీల్డ్ సిబ్బందికి ఎంపీడీవో మెమోలు
- చుట్టపు చూపులా వస్తున్న ఇన్‌చార్జి



సలుగు సచివాలయం

పాడేరురూరల్, జూలై 8: మండలంలోని మారుమూల సలుగు గ్రామ సచివాలయంలో ప్రజలకు సేవలందడం లేదు. ఇక్కడ సిబ్బంది లేకపోవడంతో సచివాలయం ఉత్సవ విగ్రహంలా దర్శనమిస్తున్నది. సచివాలయం తెరిచి ఉన్నప్పటికీ ఎవరూ అక్కడ ఉండడం లేదని స్థానికులు తెలిపారు. ఈ సచివాలయంలో విధులు నిర్వహించే సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్ విధి నిర్వహణలో నిర్లక్ష్యం, పింఛన్ల పంపిణీలో అవకతవకలకు పాల్పడడంతో సస్పెండ్ అయ్యారు. దీంతో సలుగు సచివాలయ నిర్వహణ బాధ్యతను ఐనాడ గ్రామ సచివాలయ సెక్రటరీకి అప్పగించారు. రెండు సచివాలయాలకు దూరం ఎక్కువ ఉండడంతో ఆయన చుట్టపు చూపులా సలుగు వస్తూ వెళుతున్నారు. ఈ సచివాలయంలో ఏడుగురు సిబ్బంది ఉండాలి. వీరిలో సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్ సస్పెండ్ కాగా.. సర్వేయర్‌ను సబ్‌కలెక్టర్ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై వెళ్లారు. వెల్ఫేర్ సెక్రటరీ లాంగ్ లీవులో ఉన్నారు. ఏఎస్ఎం ఈదులపాలెం పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చరల్ అసిస్టెంట్‌లు ఫీల్డ్‌లో ఉంటున్నారు. జూలై 1వ తేదీన ఎంపీడీవో కె.సాయి నవాన్ స్వయంగా సలుగు సచివాలయానికి వెళ్లి పింఛన్ల ... మిగతా 6వ పేజీలో

కెందుగూడ పాఠశాలకు పక్కా భవనం మంజూరు

- రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందించిన మంత్రి
- తక్షణమే భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అల్లూరి జిల్లా అధికారులకు ఆదేశాలు

-వార్త 5వ పేజీలో...


చేయి చేయి కలిపారు.. పాఠశాల షెడ్డును నిర్మించారు

సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

అరకులోయలో కుండపోత

- గంటన్నరపాటు కురిసిన వర్షం
- రోడ్లుపై నిలిచిన వర్షపు నీరు
- వరినాట్లుకు మేలంటున్న గిరి రైతులు



యండపల్లివలసలో వర్షం

అరకులోయ, జూలై 8: అరకులోయ, పరిసర ప్రాంతాల్లో సోమవారం మధ్యాహ్నం కుండపోతగా వర్షం కురిసింది. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమైన వర్షం మూడున్నర గంటల వరకు ఏకధాటిగా పడింది. దీంతో ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలిచిపోయింది. యండపల్లివలస గంగమ్మతల్లి ఆలయం ఎదుట మెయిన్ రోడ్‌లో ఒకవైపు 200 మీటర్ల మేరకు వర్షపు నీరు నిలిచిపోవడంతో చిన్నపాటి చెరువులా తయారైంది. దీంతో ద్విచక్ర వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు.

అదేవిధంగా అరకులోయలో సెరికల్చర్-అంజలి రిసార్టు మధ్య ఉన్న బురదగెడ్డ వంతెనపై వర్షపు నీరు నిలిచిపోయింది. భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ వర్షం వరినాట్లు వేసుకునేందుకు అనువుగా ఉందని గిరిరైతులు తెలిపారు. ఇటీవల భారీ వర్షాలు లేకపోవడంతో వర్షాధారంతో పండించే పొలాల్లో వరినాట్లు వేయడం ఆలస్యం అయ్యింది. సోమవారం పడిన భారీ వర్షంతో దమ్ములు పట్టి వరినాట్లు వేసుకోవచ్చునని రైతులు సంబరపడుతున్నారు.



కలెక్టరేట్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు శ్రావణ్‌కుమార్, ఈశ్వరి

ఉచిత ఇసుక పాలసీ రాష్ట్ర ప్రగతికి బాట

- ఇసుక మాఫియాతో రూ.కోట్లు కొల్లగొట్టిన జగన్మోహన్‌రెడ్డి
- టీడీపీ అరకు పార్లమెంట్, పాడేరు అసెంబ్లీ ఇన్‌చార్జిలు కె.శ్రావణ్‌కుమార్, జి.ఈశ్వరి

-వార్త 6వ పేజీలో...

క్రైం... crime news

ప్రమాదవశాత్తూ చెరువులో పడి రైతు మృతి



మృతిచెందిన రైతు గంట్ల అప్పారావు(ఫైల్)

చీడికాడ, జూలై 8: మండలంలో చెట్టుపల్లికి చెందిన గంట్ల అప్పారావు (56) అనే రైతు ప్రమాదవశాత్తూ మర్రిచెరువులో పడి మృతి చెందాడు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జి.నారాయణరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెట్టుపల్లి గ్రామంలో గంట్ల అప్పారావు మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత పాడిపశువులను మేతకు మర్రిచెరువు వద్ద ఆదివారం మధ్యాహ్నం తీసుకు వెళ్లాడు. కొంతసేపు మేత మేసిన పశువులు చెరువులోకి వెళ్లాయి. పశువులు ఎంతసేపటికి ఒడ్డుకు రాకపోవడంతో వాటిని పైకి రప్పించేందుకు చెరువు ఒడ్డున దిగి మందలిస్తున్నాడు. అయితే అదే చెరువుగట్టుపై వెళుతున్న గ్రామానికి చెందిన గొర్లె రాము అనే మహిళ చెరువు లోపలికి వెళ్లవద్దు ఊబి ఉందని చెప్పి వెళ్లిపోయింది. పాడిపశువులు ఎంతకీ రాకపోవడంతో కొంతవరకూ దిగిన అప్పారావు ఊబిలో కూరుకుపోయాడు. సాయంత్రం అయ్యేసరికి పశువులు అప్పారావు ఇంటికి వచ్చేశాయి. తన భర్త అప్పారావు రాలేదని అదేరోజు రాత్రి 8 గంటల వరకూ వేచిచూసింది. మర్రి చెరువు వద్దకు తన కుటుంబ సభ్యులను తీసుకుని వెళ్లింది. చెరువు ఒడ్డున తన భర్త చెప్పులు ఉండడంతో కుటుంబ సభ్యులతో చెరువులో వెతికించింది. దీంతో అప్పారావు ఊబిలో మృతి చెంది ఉన్నాడు. దీనిపై సోమవారం ఉదయం చీడికాడ పోలీస్‌స్టేషన్‌కు లక్ష్మి ఫిర్యాదు చేయగా.. వెంటనే ఎస్ఐ జి.నారాయణరావు సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

లాడ్జీల్లో పోలీసుల తనిఖీలు

అనకాపల్లి టౌన్, జూలై 8 : పట్టణంలోని లాడ్జీల్లో సోమవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. రాంబిల్లి మండలం కొప్పుగొండుపాలెం గ్రామంలో బాలికను హత్య చేసిన బోడాబత్తుల సురేశ్ కోసం గాలింపు చర్యల్లో భాగంగా పట్టణంలో అన్ని లాడ్జీలను తనిఖీలు చేశారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు

చింతపల్లి, జూలై 8: గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఐ అరుణ్ కిరణ్ తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, మండల కేంద్రం టీడబ్ల్యూ బాలుర గురుకుల కళాశాల దిగువన అనుమానంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని బ్యాగ్‌లు తనిఖీ చేయగా.. మూడున్నర కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. పట్టుబడిన ఇద్దరు నిందితుల్లో ఒకరిది తిరుపతి కాగా, మరొకరు తమిళనాడుకు చెందిన వ్యక్తియని అన్నారు. వారిని అరెస్టు చేసి న్యాయస్థానానికి తరలించామని ఎస్ఐ అరుణ్ కిరణ్ తెలిపారు.

బాలిక హత్య కేసులో నిందితుడి ఆచూకీ చెబితే రూ. 50 వేల నజరానా

» పోస్టర్ విడుదల చేసిన జిల్లా పోలీసులు



రాంబిల్లి, జూలై 8 : మండలంలోని కొప్పుగొండుపాలెంలో బాలికను హత్య చేసి పరారీలో ఉన్న నిందితుడు బి.సురేశ్ ఆచూకీ చెబితే రూ.50 వేల నగదు బహుమతి అందజేస్తామని జిల్లా పోలీస్ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హంతకుడి కోసం పోలీస్ అధికారులు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నా ఇంతవరకు ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఎస్పీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు.. నిందితుడి వివరాలతో కూడిన పోస్టర్‌ను విడుదల చేశారు. నిందితుడు ఆచూకీ తెలిపిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. నిందితుడి ఆచూకీ తెలిసినవారు 9440796084, 9440796108, 9440904229 ఫోన్ నంబర్లకు తెలియజేయాలని పోలీస్ అధికారులు ఆ ప్రకటనలో కోరారు.

ప్రైవేటు ఆర్వో ప్లాంట్ సీజ్

అచ్యుతాపురం, జూలై 8: దిబ్బపాలెం పంచాయతీ మోటూరుపాలెంలోని ఓ ప్రైవేటు ఆర్వో ప్లాంట్‌ను అధికారులు సోమవారం సీజ్ చేశారు. మోటూరుపాలెంలో ఇటీవల డయేరియా వ్యాపించి సుమారు 20 మంది అస్వస్థతకు గురయ్యారు. దీంతో అధికారులు పారిశుధ్యంతో పాటు ఇతర అంశాలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా పంచాయతీ పరిధిలో గల ఆర్వో ప్లాంట్‌లను పరిశీలిస్తున్నారు. పంచాయతీ పరిధిలో ప్రభుత్వానికి చెందిన ఒక ఆర్వో ప్లాంట్‌తో పాటు మరో ఐదు ప్రైవేటు ఆర్వో ప్లాంట్లు ఉన్నాయి. ముందుగా మోటూరుపాలెం వద్ద ఉన్న ఆర్వో ప్లాంట్ నీటిని విశాఖపట్నం పరిశీలనకు పంపారు. ఈ ప్లాంట్ ద్వారా వచ్చిన నీటిని ప్రజలతో పాటు పక్కనే గల పాఠశాల పిల్లలకు కూడా ప్రతి రోజూ ఇస్తున్నారు. ఈ ఆర్వో ప్లాంట్‌లోని నీటిలో బాక్టీరియా ఉన్నట్టు నివేదిక వచ్చింది. దీంతో ఎంపీడీవో సురేశ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, పీహెచ్‌సీ సీఈవో వేణుగోపాల్ సోమవారం ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించారు. ఇక్కడ ట్యాంక్‌లో భారీగా నాచు పేరుకుపోయి ఉండడాన్ని గమనించారు. దీంతో వెంటనే ఆర్వో ప్లాంట్‌ను సీజ్ చేశారు. అలాగే పంచాయతీ పరిధిలో గల మిగిలిన ఆర్వో ప్లాంట్ల నీటి నమూనాలను కూడా పరిశీలనకు పంపారు.

అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్న ఎక్స్‌కవేటర్, లారీ సీజ్



గంగవరంలో సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్

సబ్బవరం, జూలై 8 : జీవీఎంసీ 88వ వార్డు పరిధి గంగవరం గ్రామంలో జగనన్న కాలనీ లేఅవుట్ వద్ద సర్వే నంబరు 59లో అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్న ఎక్స్‌కవేటర్‌ను, గ్రావెల్ తరలిస్తున్న లారీని సోమవారం అధికారులు పట్టుకొని సీజ్ చేశారు. 'ప్రభుత్వం మారినా మాకేంటి? శీర్షికన గత నెల 28న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ, గనుల శాఖ అధికారులు స్పందించారు. సోమవారం తవ్వకాలు జరుగుతుండగా వీఆర్వో వెంకటేశ్ మాటు వేసి పట్టుకుని మైనింగ్ డిపార్టుమెంట్ రాయల్టీ అధికారిణి స్వాతికి అప్పగించారు. ఆమె సీజ్ చేసి తదుపరి చర్యల నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించారు. మైనింగ్ రాయల్టీ అధికారిణి స్వాతి మాట్లాడుతూ ప్రతి రోజు గంగవరం, నంగినారపాడు తదితర ప్రాంతాల్లో నిఘా పెట్టి గ్రావెల్/మట్టి అక్రమ తరలింపులను అడ్డుకొని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	103.00
లైవ్ ధర	123.00
విత్ స్కిన్	216.00
స్కిన్ లెస్	226.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

ఉద్యోగుల సమష్టి కృషితో సింహాద్రి పురోభివృద్ధి

» సంస్థ వ్యవస్థాపక దినోత్సవంలో సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా



ఉద్యోగుల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న సింహాద్రి సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా

పరవాడ, జూలై 8 : సింహాద్రి ఎన్టీపీసీ పురోభివృద్ధికి అధికారులు, ఉద్యోగులు సమష్టిగా కృషి చేశారని సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ 27వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం ప్లాంట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీజీఎం తొలుత జెండాను ఆవిష్కరించారు. సీఐఎస్ఎఫ్ జవాన్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అధికారులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలకు నాణ్యమైన విద్యుదుత్పత్తిని అందిస్తున్న ఘనత సింహాద్రి ఎన్టీపీసీకే దక్కుతుందన్నారు. నాణ్యమైన విద్యుదుత్పత్తిని సాధించడంలో దేశంలోనే సింహాద్రికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. సంస్థ అన్ని రంగాల్లో విజయం సాధించడానికి ఉద్యోగులు, అధికారులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా నిర్వాసిత గ్రామాల అభివృద్ధికి తమ వంతు సాయం అందిస్తున్నామన్నారు. ఇందు కోసం కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నామని వెల్లడించారు. వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా స్థానిక బాలభారతి పబ్లిక్ స్కూల్ విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి జీఎంలు, ఏజీఎంలు, దీపికా లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజుసిన్హా, క్లబ్ ప్రతినిధులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అశ్రద్ధ వద్దు

» అధికారులకు ఎస్పీ మురళీకృష్ణ ఆదేశం



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు

అనకాపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో ఎటువంటి అశ్రద్ధ చేయవద్దని అధికారులను ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో కుటుంబ తగాదాలు, ఆస్తి తగాదాలు, మోసం, కుటుంబ కలహాలు తదితర వివాదాలపై బాధితుల నుంచి 36 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. పలువురు ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులతో ఎస్పీ మాట్లాడారు. సామాజిక మాధ్యమాల్లో బ్రాహ్మణులను కించపరిచే విధంగా పోస్టింగ్‌లు పెడుతున్న పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన దాసు అనే వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ అనకాపల్లి, కశింకోట మండలాల బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీసు అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ ఉపేంద్రబాబు, దివ్య తదితరులు పాల్గొన్నారు.

కూర్మావతారంలో జగన్నాథుడు



కూర్మావతారంలో ఉన్న జగన్నాథస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి టౌన్, జూలై 8 : స్థానిక ఇంద్రజ్యుమ్న హాల్‌లో కొలువై ఉన్న సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామి సోమవారం భక్తులకు కూర్మావతారంలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చైర్మన్ దాడి బుజ్జి, ఈవో రాజసులోచన, కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారు.

10న కోర్కెల దినంలో పాల్గొనండి

అనకాపల్లి టౌన్, జూలై 8 : కేంద్రంలో, రాష్ట్రంలో ఏర్పడిన ప్రభుత్వాలు కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని కోరుతూ ఈ నెల 10వ తేదీన నిర్వహించే కోర్కెల దినాన్ని విజయవంతం చేయాలని వీవోఏల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్. రూపాదేవి పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సోమవారం వీవోఏలు, ఉద్యోగుల సంఘం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీవోఏల సమస్యలు గత ఐదేళ్లగా అపరిష్కృతంగానే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు వీవీ శ్రీనివాసరావు, సంఘ ప్రతినిధులు లక్ష్మీ ప్రసన్న, రాజేష్, రమణ, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ దర్శనానికి వచ్చిన యువతి అదృశ్యం

విజయవాడ, జూలై 8: దుర్గమ్మ దర్శనానికి వచ్చిన అనకాపల్లి జిల్లాకు చెందిన యువతి అదృశ్యమైనట్టు సోమవారం విజయవాడలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం పెద్దబొడ్డేపల్లి గ్రామానికి చెందిన యువతి (18) కుటుంబసభ్యులతో కలిసి ఈ నెల 4న వెంకటేశ్వరస్వామి దర్శనం నిమిత్తం తిరుపతి వెళ్లారు. అక్కడ దర్శనానంతరం ఈనెల 7న విజయవాడ కనకదుర్గమ్మ దర్శనార్థం ఇంద్రకీలాద్రికి వచ్చారు. దర్శనానంతరం కొండ దిగారు. కుటుంబసభ్యులతో నడుచుకుంటూ వస్తున్న యువతి కనిపించలేదు. తల్లిదండ్రులు, బంధువులు వెదికినప్పటికీ ఆచూకీ లభించలేదు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వారితోపాటు వచ్చిన శ్రీను అనే యువకుడు కూడా కనిపించకపోవడంతో అతడిపై అనుమానం ఉన్నట్టు యువతి తండ్రి పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

మాడుగుల సంతలో గిరి ఫలాలకు గిరాకీ



మాడుగుల సంతకు గిరిజనులు తీసుకొచ్చిన పైనాపిల్స్

మాడుగుల రూరల్, జూలై 8: మాడుగులలో సోమవారం జరిగిన వారపు సంతలో గిరి ఫలాలకు మంచి గిరాకీ లభించింది. పాడేరు ఏజెన్సీకి చెందిన దేవపురం, కక్కి, కందులుపాలెం, ఈదులుపాలెం, సలుగు, పులుసుమామిడి తదితర గిరిజన గ్రామాల్లోని చెందిన గిరిరైతులు పనస, పైనాపిల్, సీతాఫలాలను పండిస్తుంటారు. ఆయా ఫలాలను కొంతమంది కాలినడక, మరికొంతమంది మినీ వ్యాన్లు, ఆటోలపై ప్రతి సోమవారం మాడుగులలో జరిగే సంతకు తీసుకొస్తుంటారు. వీటిని కొనుగోలు చేసేందుకు అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, తుని, రాజమండ్రి తదితర దూర ప్రాంతాల నుంచి వర్తకులు వస్తుంటారు. గత వారం కంటే ఈ వారం సరుకు తక్కువగా రావడంతో గిరిఫలాలకు ధర పెరిగింది. గత వారం సరుకు ఎక్కువగా రావడంతో చిన్న, పెద్ద సైజుని బట్టి ఒక్క పైనాపిల్ ధరరూ.10లు, రూ.15లు, పనస పండు రూ.70, రూ.100 పలికింది. కాగా. ఈ సోమవారం సరుకు తక్కువగా రావడంతో పైనాపిల్ ధర రూ.20, రూ.25, పనస రూ.100, రూ.150,రూ.200 వరకు పలికింది. ధర ఆశాజనకంగా ఉండడంతో గిరి రైతులు ఆనందం వ్యక్తంచేశారు.

కెందుగూడ పాఠశాలకు పక్కా భవనం మంజూరు

» రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశం
» 'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందించిన మంత్రి
» తక్షణమే భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అల్లూరి జిల్లా అధికారులకు ఆదేశాలు



అమరావతి/పాడేరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ముంచంగిపుట్టు మండలం కెందుగూడ గిరిజన గ్రామంలో పాఠశాల భవనాన్ని నిర్మించాలని అల్లూరి జిల్లా అధికారులను రాష్ట్ర విద్యా ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'చేయి చేయి కలిపారు.. పాఠశాల షెడ్డును నిర్మించారు' శీర్షికన వచ్చిన కథనంపై మంత్రి లోకేష్ స్పందించారు. వార్త చూసిన వెంటనే కెందుగూడలో పాఠశాలకు పక్కా భవనాన్ని నిర్మించాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తమ పిల్లలకు విద్యను అందించే బడి కోసం గిరిజనులు చేసిన కృషి అభినందనీయమని లోకేష్ ప్రశంసించారు. కెందుగూడలో ఆరేళ్ల క్రితం శిథిల భవనాన్ని అధికారులు కూల్చివేశారు. తర్వాత గ్రామస్థులు ఎన్ని పర్యాయాలు వినతులు ఇచ్చినా పాలకులు, అధికారులకు స్పందించలేదు. దీంతో గిరిజనులు, ఉపాధ్యాయుల సహకారంతో రేకుల షెడ్డును నిర్మించారు. ఈ విషయాన్ని వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'కి కెందుగూడ గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్ఎఫ్ఐ రాస్తారోకో

నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్



నిందితుడు సురేశ్‌ను కఠినంగా శిక్షించాలని ఆందోళన చేస్తున్న విద్యార్థులు

రాంబిల్లి, జూలై 8: మండలంలోని కొప్పుగొండుపాలెం గ్రామంలో బాలికను దారుణంగా హత్య చేసిన నిందితుడు సురేశ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం రాంబిల్లి ప్రధాన జంక్షన్‌లో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ బాలికను హత్యచేసి పరారీలో ఉన్న నిందితుడు సురేశ్‌ను మూడు రోజులైనా పోలీసులు పట్టుకోకపోవడం బాధాకరమన్నారు. నిందితుడిని త్వరగా పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు వై.రాము, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడునాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

'డ్రగ్స్, పోక్సో కేసుల్లో నిందితులపై పర్యవేక్షణ అవసరం'



విచారణ జరుపుతున్న బాలల హక్కుల కమిషన్, రాష్ట్ర మహిళా కమిషన్ ప్రతినిధులు

రాంబిల్లి, జూలై 8: డ్రగ్స్, పోక్సో కేసుల్లో బెయిల్‌పై విడుదల అయ్యే అనుమానిత వ్యక్తులపై పోలీస్ యంత్రాంగం నిరంతర పర్యవేక్షణ ఉండాలని, వారికి పూర్తిస్థాయిలో కౌన్సెలింగ్ అందించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, రాష్ట్ర మహిళా కమిషన్ ప్రతినిధులు సూచించారు. మండలంలోని కొప్పుగొండుపాలెం గ్రామానికి చెందిన బాలిక హత్యకు గురైన నేపథ్యంలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ తదితరులు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. జరిగిన సంఘటనపై విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు అధికారి ఇందిరాదేవి, శశికళ, పర్యవేక్షక అధికారి రాణి, మిషన్ వాత్సల్య సిబ్బంది లక్ష్మి, లోవరాజు పాల్గొన్నారు.

ఆగస్టు 5 నుంచి 11 వరకు తిరుమల ఎక్స్‌ప్రెస్ రద్దు

» మళ్లింపు మార్గంలో పలు రైళ్లు

విశాఖపట్నం, జూలై 8: విజయవాడ స్టేషన్ వద్ద మూడో లైను నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఆగస్టు 5 నుంచి 10వ తేదీ వరకు విశాఖ - తిరుపతి /కడప ఎక్స్‌ప్రెస్ (17488), ఆగస్టు ఆరు నుంచి 11వ తేదీ వరకు కడప /తిరుపతి-విశాఖ ఎక్స్‌ప్రెస్ (17487)లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. ఆగస్టు 2 నుంచి 10 వరకు విశాఖ-న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్ (20805), విశాఖ- లోకమాన్య తిలక్ టెర్మినస్ ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519), భువనేశ్వర్- ముంబాయి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020), షాలిమార్- హైదరాబాద్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045); ఆగస్టు 3 నుంచి 11వ తేదీ వరకు విశాఖ-హైదరాబాద్ గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727); ఆగస్టు 5 నుంచి 9 వరకు విశాఖ- నిజాముద్దీన్ స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్ (12803); ఆగస్టు 8న విశాఖ- సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్ (18503), టాటా-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (18111), విశాఖ-గాంధీధాం ఎక్స్‌ప్రెస్ (20803) రైళ్లు వయా గుణదల, రాయనపాడు మీదుగా మళ్లింపు మార్గంలో నడుస్తాయి. ఆగస్టు 2 నుంచి 10 వరకు సికింద్రాబాద్ - విశాఖ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (12739), ముంబాయి- భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019), న్యూఢిల్లీ-విశాఖ ఏపీ ఎక్స్‌ప్రెస్ (20806), సాయినగర్ షిర్డీ-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18504), లోకమాన్య తిలక్-విశాఖ ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18520); ఆగస్టు 3 నుంచి 11వ తేదీ వరకు హైదరాబాద్-విశాఖ గోదావరి ఎక్స్‌ప్రెస్ (12728), హైదరాబాద్-షాలిమార్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18046); ఆగస్టు 4, 7న నిజాముద్దీన్-విశాఖ స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్ (12804); ఆగస్టు 4న గాంధీధాం-విశాఖ ఎక్స్‌ప్రెస్ (20804), ఆగస్టు 7న ఓకా-పూరి ఎక్స్‌ప్రెస్ (20820) రైళ్లు వయా రాయనపాడు, గుణదల మీదుగా మళ్లింపు మార్గంలో నడుస్తాయి. ఈ రైళ్లకు రాయలపాడులో హాల్ట్ కల్పించారు.

అనుమానాస్పదంగా రిమాండ్ ఖైదీ మృతి

మద్దిలపాలెం (విశాఖపట్నం), జూలై 8: నగరంలోని పెదవాల్తేరు ప్రభుత్వ మానసిక వైద్యశాలలో చికిత్స పొందుతున్న రిమాండ్ ఖైదీ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం...ఉమ్మడి ప్రకాశం జిల్లా మార్కాపురం ప్రాంతానికి చెందిన అరెమల్ల అశోక్ (24) మానసిక రోగి. 2022లో తన తల్లిని హత్య చేయడంతో పోలీసులు అరెస్టు చేయగా కోర్టు రిమాండ్ విధించింది. ఈ మేరకు ఒంగోలు జైలు నుంచి చికిత్స నిమిత్తం ఈ ఏడాది మే 26న నగరంలోని ప్రభుత్వ మానసిక వైద్యశాలకు తీసుకువచ్చారు. కొన్ని రోజులు చికిత్స అనంతరం పోలీసులు మళ్లీ ఒంగోలు జైలుకు తరలించగా అక్కడ నిందితుడు పెదనాన్న బెయిల్ ఇప్పించాడు. ఇంటికి వెళ్లిన కొద్దిరోజులకే అశోక్ తన పెదనాన్నను కూడా హత్య చేయడంతో పోలీసులు మళ్లీ అరెస్టు చేసి, జైలుకు తరలించారు. సమస్య ఎక్కువ కావడంతో మళ్లీ ఒంగోలు నుంచి వారం క్రితం పెదవాల్తేరులోని ప్రభుత్వ మానసిక వైద్యశాలకు తీసుకువచ్చారు. అప్పటి నుంచి జైల్ గార్డు సంరక్షణలో చికిత్స పొందుతున్నాడు. గార్డు ఆదివారం రాత్రి అశోక్‌ను చూడడానికి వెళ్లేసరికి వార్డులోని కిటికీ ఊచలకు బెడ్‌షీట్‌తో ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే ఆసుపత్రి సిబ్బంది సహకారంతో బయటకు తీసుకురాగా వైద్యులు చికిత్స అందించారు. సోమవారం వేకువజామున 2.40 గంటలకు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆస్పత్రి వైద్యుల ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా హత్య కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న అశోక్ మానసిక ఆసుపత్రిలో ఆత్మహత్య చేసుకోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

40 కిలోల గంజాయి స్వాధీనం

మాకవరపాలెం, జూలై 8 : మండలంలోని భీమబోయినపాలెంలో బాత్‌రూమ్‌లో దాచి పెట్టిన 40 కిలోల స్వాధీనం చేసుకొని యువకుడ్ని పోలీసులు అరెస్టు చేసినట్టు మాకవరపాలెం ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. భీమబోయినపాలెం గ్రామానికి చెందిన మురుకుట్టి ఈశ్వర సాయిసతీష్ (20) పాడేరు ఏజెన్సీలో గంజాయి కొనుగోలు చేసి చెన్నైకి చెందిన వ్యక్తులకు విక్రయిస్తుంటాడు. ఈనెల ఐదో తేదీన ఎప్పటి మాదిరిగానే పాడేరులో 40 కిలోల గంజాయిని, కిలో రూ.5వేలు చొప్పున కొనుగోలు చేసి తన ఇంటి బాత్‌రూమ్‌లో దాచి పెట్టాడు. పోలీసులకు అందిన పక్కా సమాచారంతో దాడి చేసి 40 కిలోల గంజాయిని, సెల్ స్వాధీనం చేసుకొని నిందితుడ్ని అరెస్టు చేసి, రిమాండ్‌కి తరలించినట్టు ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. ఈ కేసులో మరికొందర్ని అరెస్టు చేయాల్సి ఉందని ఆయన తెలిపారు.

రహదారిద్ర్యం.. గిరిజనులకు నరకం!

మండల వ్యాప్తంగా రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. ఎక్కడికక్కడ పెచ్చులు ఊడిపోయాయి. ఆద్యంతం రాళ్లు తేలిపోయాయి. గోతులు పడి దారుణంగా తయారయ్యాయి. చినుకు పడితే చిత్తడవుతున్నాయి. వర్షం కురిస్తే చెరువులను తలపిస్తున్నాయి. మట్టి మార్గాలైతే బురదమయమవుతున్నాయి. వాహన చోదకులు, ప్రయాణికులు, గిరిజనులకు ప్రత్యక్ష నరకం చూపుతున్నాయి.

భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారులు
ఎక్కడికక్కడే గోతులు, తేలిపోయిన రాళ్లు
వరద నీరు చేరి చెరువులను తలపిస్తున్న వైనం
పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు
వాహన చోదకులు, పాదచారుల పడరాని పాట్లు

ముంచంగిపుట్టు, జూలై 8: మండలంలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారులు దెబ్బ తిన్నాయి. దీంతో అటుగా వాహన రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ముంచంగిపుట్టు నుంచి పెదబయలు వెళ్లే మార్గం మధ్యలోని చోటాముక్కిపుట్టు వద్ద వరదనీటి ఉధృతికి రహదారి కోతకు గురైంది. ఈ రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో వరదనీరు నిల్వఉండటంతో చెరువులను తలపిస్తున్నది. మండల కేంద్రంలో నుంచి కుమడ వెళ్లే మార్గం మధ్యలో గల కరిముక్కిపుట్టు, పెద్దాపుట్టు, డేగలపుట్టు, కుమడ తదితర ప్రాంతాల్లో పలు చోట్ల రహదారి కోతకు గురైంది. అలాగే 23 పంచాయతీల పరిధిలో పలు గ్రామాలకు వెళ్లే మట్టి రహదారులు రూపు మారిపోయాయి. రహదారుల పొడవునా బురద పేరుకుపోవడంతో వాహన రాకపోకలు సాగించడం కష్టంగా ఉంటుందని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు చోట్ల పాదచారులు సైతం వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది.


ముంచంగిపుట్టు-పెదబయలు రహదారిలో తేలిపోయిన రాళ్లు


చోటాముక్కిపుట్టు రహదారిలో వంతెనపై చెరువును తలపిస్తున్న గొయ్యి

వంతెనపై మార్గం.. ప్రమాదకరం

మండల కేంద్రం నుంచి పెదబయలు వెళ్లే మార్గమధ్యంలోని చోటాముక్కిపుట్టు సమీపంలో ప్రధాన రహదారిపై వంతెన ముందు భాగంలో కోతకు గురై భారీ రంధ్రం ఏర్పడింది. దాని మరమ్మతు విషయాన్ని సంబంధిత అధికారులు చేపట్టలేదు. దాని పర్యావసానంగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ ప్రదేశంలో మరికాస్త అధ్వానంగా మారింది. ఆ రంధ్రంపై వరదనీరు నిల్వ ఉండిపోతుంది. దీంతో అటుగా రాకపోకలు సాగించే ద్విచక్ర వాహన చోదకులు తరచూ ఆ ప్రదేశంలో ప్రమాదాల బారిన పడుతున్నారు.

ఆ వంతెన ముందు భాగంలో డ్రైనేజీ సదుపాయం లేకపోవడం వలన నీరు నిల్వ ఉండిపోవడంతో కోతకు గురైంది. ఆ మార్గంలో ఆంధ్రా, ఒడిశాకు చెందిన వాహనాలు నిత్యం అధిక సంఖ్యలో తిరుగుతుంటాయి. అయినప్పటికీ రంధ్రాన్ని పూడ్చేందుకు అధికారులు కనీస దృష్టిసారించకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. దీంతో ఆ ప్రదేశంలో తరచూ ద్విచక్ర వాహన ప్రమాదాలు గురవుతున్నాయి. పెను ప్రమాదాలు జరగక ముందే అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రహదారి బాగోగులపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని మండల ప్రజలు, వాహన చోదకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉచిత ఇసుక పాలసీ రాష్ట్ర ప్రగతికి బాట

» అరకు పార్లమెంట్, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గాల తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్‌లు కిడారి శ్రావణ్‌కుమార్, గిడ్డి ఈశ్వరి

పాడేరు రూరల్, జూలై 8: ఏపీ ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ తీసుకురావడం వల్ల రాష్ట్ర ప్రగతికి బాటలు వేసినట్లయిందని అరకు పార్లమెంట్, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గాల తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్‌లు కిడారి శ్రావణ్‌కుమార్, గిడ్డి ఈశ్వరి అన్నారు. సోమవారం కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్‌ను కలిసిన అనంతరం కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో విలేకరులతో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఉచిత ఇసుక విధానం వల్ల సామాన్య గృహ నిర్మాణ లబ్ధిదారులకు భారీ ఊరట కలుగుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన నెలలోజుల్లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు అమల్లోకి తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. సామాన్యులకు ఇసుకను అందుబాటులో ఉంచాలన్నదే తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఆశయమన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇసుక మాఫియాతో జగన్మోహన్‌రెడ్డి కోట్లు కొల్లగొట్టారని వారు ఆరోపించారు. జగన్ ప్రభుత్వం ఇసుక కుంభకోణం ద్వారానే రూ.50 వేల కోట్లకు పైగా కొల్లగొట్టారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో గృహ నిర్మాణదారులకు ఇసుక కొనుగోలు పెనుభారంగా ఉండేదన్నారు. సుప్రీం కోర్టు, హైకోర్టు, ఎన్జీటీ నిబంధనలకు అనుగుణంగా పర్యావరణ పరిరక్షణ దెబ్బతినకుండా ఉచిత ఇసుక అందించే విధంగా చంద్రబాబు చర్యలు చేపట్టారన్నారు. జిల్లా స్థాయిలో ఇసుక కమిటీలను ఏర్పాటు చేసి కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవోలు, మైనింగ్ అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలోనే సేవలు పొందండి

» జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి షేక్ జమాల్ బాషా


చీడిమెట్ట గ్రామంలో గిరిజనులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా

పాడేరు రూరల్, జూలై 8: గిరిజన ప్రాంత ప్రజలు వ్యాధులు సోకితే వైద్య అవసరాలకు ప్రైవేటు వైద్యులను ఆశ్రయించకుండా సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి వైద్య సేవలు పొందాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి షేక్ జమాల్ బాషా సూచించారు. మండలంలోని చీడిమెట్ట పీవీటీజీ గ్రామంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. గ్రామంలో బాధితులకు వైద్య సిబ్బంది చేపట్టిన మలేరియా పరీక్షలను పరిశీలించారు. అలాగే అందరికీ బీపీ, షుగర్, హెచ్‌బీ టెస్టులను నిర్వహించి రోగులకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. అవసరమైన మందులను పంపిణీ చేశారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మారుమూల గ్రామాల ప్రజలు మూఢ నమ్మకాలను విడిచిపెట్టాలని, కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయ ప్రహరీ గోడకు శంకుస్థాపన

ముంచంగిపుట్టు, జూలై 8: మండల పరిషత్ కార్యాలయం ప్రహరీ గోడ నిర్మాణ పనులకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర సోమవారం శంకుస్థాపన చేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.33 లక్షలవెచ్చించి ప్రహరూఈ గోడ ర్మాణం చేపడుతున్నట్టు ఈ సందర్భంగా ఆమె తెలిపారు. నాణ్యతాప్రమాణాలు పాటిస్తూ పనులు సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్, ఎంపీపీ ఎ.సీతమ్మ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఉపాధ్యాయులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో వైద్యారోగ్య సమస్యలు పరిష్కరించండి

జిల్లా కలెక్టర్‌ను కోరిన మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్


కలెక్టర్ దినేశ్‌కుమార్‌కు సమస్యలు తెలుపుతున్న శ్రావణ్‌కుమార్, నాయకులు

పాడేరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో సీజనల్‌గా వస్తున్న ఆరోగ్య సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్ కుమార్‌ను టీడీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ కోరారు. టీడీపీ నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో సోమవారం కలెక్టర్‌ను ఆయన కలిశారు. ఏజెన్సీలో ప్రస్తుతం సీజన్‌లో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూతో పాటు పలు రకాల అంటువ్యాధులు ప్రబలుతాయని, వాటిని సమర్థంగా ఎదుర్కొనేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ముందస్తు ప్రణాళికతో గ్రామాల్లో అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో సదుపాయాలు మెరుగుపర్చాలని, ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో అల్ట్రాసౌండ్ స్కానర్ లేకపోవడంతో గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారని ఉదహరణగా తెలిపారు. ప్రతి సీహెచ్‌సీ, పీహెచ్‌సీలో సదుపాయాలు మెరుగుపర్చాలని కోరారు. అనంతరం టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధులు కలెక్టర్‌కు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధులు సుబ్బారావు, తులసీరావు, బాకూరు వెంకటరమణరాజు, పాండురంగస్వామి, తామర్ల సత్యనారాయణ, పలాసి సుమన్, సాగర సత్యవతి, కొమ్మా రమా, ప్రసాద్, వెంకటరావు, మోహన్, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలు సక్రమంగా అమలుచేయాలి

అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి రమాదేవి


ఐద్వా మహిళా సంఘాల ప్రతినిధుల శిక్షణలో ప్రసంగిస్తున్న రమాదేవి

అరకులోయ, జూలై 8: మహిళల చట్టాలు సక్రమంగా అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని గిరిజన్ భవన్‌లో ఆదివాసీ మహిళా గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ శిక్షణ శిబిరంలో రమాదేవి మాట్లాడుతూ మహిళలు ఇంకా హింసకు, అత్యాచారాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా చాలా మంది పురుషులు మద్యం మత్తులో మరింత అరాచకానికి ఒడిగడుతున్నారని వాపోయారు. మద్యం, గంజాయిని నిషేధించాలని ఆమె డిమాండ్ చేశారు. ఇప్పటికే గ్రామాల్లోని మహిళల్లో చైతన్యం తీసుకువచ్చే విధంగా మహిళా సంఘాలు కృషి చేస్తున్నాయన్నారు. మహిళలను పురుషులతో సమాన గౌరవం ఇవ్వాలని, సమాన హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే పురుషులతో సమానంగా స్త్రీలకు వేతనాలు చెల్లించాలని కోరారు. ప్రభుత్వ పథకాల కింద పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కనీస వేతనాలకు నోచుకోవడం లేదని వాపోయారు. ఇటువంటి సమస్యలను గుర్తించి మహిళలంతా ఐక్యంగా ఉండి గిరిజన మహిళా సంఘాలతో కలిసి పోరాడుతూ హక్కులను సాధించుకోవాలని సూచించారు. మొదటి రోజు శిక్షణా తరగతుల్లో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు వీవీ జయ, ఐద్వా జిల్లా అధ్యక్షులు టి.కౌసల్య, కార్యదర్శి ఎస్.హైమావతి, గిరిజన మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు శశికళ, సంయుక్త కార్యదర్శి కుమారి పాల్గొన్నారు.

విశ్రాంతి ఉద్యోగుల జిల్లా నూతన కార్యవర్గం


విశ్రాంతి ఉద్యోగుల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న నాగభూషణరాజు

పాడేరు రూరల్, జూలై 8: అల్లూరి జిల్లా విశ్రాంతి ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశాన్ని సోమవారం స్థానిక మోదకొండమ్మ ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి విశాఖ జిల్లా విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డీడీ.ప్రసాదరావు హాజరై జిల్లాలో విశ్రాంతి ఉద్యోగుల సమస్యలు, వాటి పరిష్కారాలకు చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. అనంతరం విశాఖ జిల్లాకు చెందిన అధ్యక్షుడు డీడీ.ప్రసాదరావు, కార్యదర్శి వి.కృష్ణమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పీవీ.రమణమూర్తి సమక్షంలో అల్లూరి జిల్లా విశ్రాంతి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా టి.అప్పారావు, అధ్యక్షులుగా ఆర్.నాగభూషణరాజు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కె.సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా జి.శ్రీహరిరావు, కోశాధికారిగా జి.మోహన్‌రావు, ఉపాధ్యక్షులుగా ఎం.చినరామునాయుడు, జి.మోహన్‌రావు, జె.వెంకటరమణ, వై.రామకృష్ణారావు, బి.త్రినాథరావు, బి.ఆనందరావు, ప్రచార కార్యదర్శిగా కె.మచ్చయ్య, సంయుక్త కార్యదర్శులుగా ఎం.చిన్నయ్య, ఎస్.శివప్రసాద్, ఎల్.కృష్ణ, సీహెచ్.ప్రసాదరావు పడాల్, కె.బాలంనాయుడు, జి.కనకయ్య, ముఖ్యసలహాదారులుగా కె.గంగన్న పడాల్, ఎం.కృష్ణమూర్తి, ఎ.బొంజునాయుడు, యూఆర్.కోటేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.



జి.మాడుగులలో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు... పెదబయలులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఫాల్గుణ

దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డికి ఘన నివాళులు


వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

పాడేరు రూరల్/ జి.మాడుగుల/ చింతపల్లి/ గూడెంకొత్తవీధి/అరకులోయ/సీలేరు/ పెద బయలు/హుకుంపేట/డుంబ్రిగుడ/ ముంచంగిపుట్టు/ జూలై 7: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని మన్యంలోని అన్ని మండలాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖరరెడ్డి విగ్రహానికి వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, వైసీపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. అలాగే పేదలకు వస్త్రాలు, ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలో పాడేరు, డుంబ్రిగడలో వైసీపీ నేతలు వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. చింతపల్లిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంతల సుబ్బారావు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ ఆయన ఆశయాలు సాధించేందుకు వారసురాలు షర్మిల నేడు పీసీసీ పగ్గాలు చేపట్టారన్నారు. పాత బస్‌స్టాండ్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఎంపీపీ కోరాబు అనుషదేవి, డీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచ్ దురియా పుష్పలత పూలమాలవేసి నివాళి అర్పించారు. జి.మాడుగులలో పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దివంగత నేత రాజశేఖర్ రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలను పేదలకు ఎంతగానో ఉపకరించాయని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అరకులోయలో కాంగ్రెస్ పార్టీ నేత పాచిపెంట శాంతకుమారి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పెదబయలులో అరకు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ఆర్ అందించిన సేవలను కొనియాడారు. సీలేరు దుర్గాదేవి మండపం వద్ద దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు సాంబమూర్తి ఆధ్వర్యంలో రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. హుకుంపేటలో రాజశేఖరరెడ్డి జయంతిని కాంగ్రెస్ నేత రామలింగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముంచంగిపుట్టులో జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నేటి నుంచి ఇంటింటా ఆధార్ పరిశీలన

... 3వ పేజీ తరువాయి

ఆధార్ నమోదు జరిగిందని, ఇంకా 5,104 మందికి పెండింగ్‌లో ఉందని, వాటిని పరిశీలించి క్లియర్ చేయాలని కలెక్టర్ సూచించారు. ఇటువంటి సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే ఇంటింటా సర్వే ఆధారంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆధార్ నమోదు చేయాలన్నారు. అలాగే బాల ఆధార్ పొందిన వారికి ఐదేళ్లకు, పదిహేనేళ్లకు ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ పదేళ్లు పూర్తయిన తర్వాత విధిగా ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆధార్ అప్‌డేట్ కాకుంటే అనేక సందర్భాల్లో సమస్యలు ఏర్పడతాయన్నారు.

ఎన్నికల వ్యయం బిల్లులు సమర్పించాలి

తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన వ్యయంపై బిల్లులు సమర్పించాలని రిటర్నింగ్ అధికారులు, నియోజకవర్గ కేంద్రం తహసీల్దార్లకు జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. ఎన్నికల్లో వ్యయం చేసిన నిధులకు సంబంధించిన బిల్లులు విధిగా సమర్పించాలన్నారు. అలాగే జిల్లాలో చింతూరు ప్రాంతంలో గత రెండేళ్ల వరద సహాయక చర్యలకు సంబంధించిన వ్యయం చేసిన నిధుల బిల్లులను తహసీల్దార్లు సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి, జిల్లాలోని 22 మండలాలకు చెందిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహంలా సలుగు సచివాలయం

... 3వ పేజీ తరువాయి

పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మిగిలిన పింఛన్ల పంపిణీ చేయాలని ఫీల్డ్ సిబ్బందికి అప్పగించినప్పటికీ సకాలంలో చేయలేకపోవడంతో వారికి ఎంపీడీవో మెమో జారీ చేశారు. ఇక్కడ పూర్తి స్థాయిలో సచివాలయ సిబ్బంది లేకపోవడంతో ప్రజల సమస్యలు పరిష్కారం కాక ఇబ్బంది పడుతున్నారని టీడీపీ నాయకుడు వనుగు సురేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో సచివాలయ సిబ్బందిని నియమించాలని ఆయన కోరారు.

☛ సంక్షిప్తంగా..

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

పాడేరు రూరల్, జూలై 8: అల్లూరి సీతారామ రాజు జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన ఉపాధ్యాయులు జాతీయ ఉత్తమ ఉపాధ్యా అవార్డులకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జడ్పీ, ఎంపీ, ఎయిడెడ్ యాజమాన్యాలలోని పాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న అన్ని కేటగిరీలకు చెందిన ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయులు ఈ నెల 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. వెబ్‌సైట్‌లో ఉంచిన సూచనలు, అర్హతలు ప్రకారం ఉపాధ్యాయులు, దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

కలెక్టర్ దృష్టికి మండల సమస్యలు

డుంబ్రిగుడ, జూలై 8: మండలంలోని పలు గ్రామాల్లో సమస్యలను కలెక్టర్ దినేష్‌కుమార్ దృష్టికి టీడీపీ మండల అధ్యక్షుడు టి.సుబ్బారావు, నాయకులు తీసుకువెళ్లారు. మండలంలోని రహదారులు, డ్రైనేజీలు నిర్మించాలని, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. వీటిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎం.స్వామి, త్రినాథ్, వెంకటరావు, గెన్ను తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల క్లబ్బుల ఏర్పాటుకు సహకరించాలి

జి.మాడుగుల, జూలై 8: విద్యార్థులకు వినియోగదారుల క్లబ్బులు ఏర్పాటు చేయడానికి సహకరించాలని ఎంఈవో బాబురావుపడాల్‌ను జిల్లా వినియోగదారుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు. విద్యార్థి దశ నుంచే వినియోగదారుల సేవలపై అవగాహన పెంపొందించేందుకు వీలుగా మండలానికి చెందిన 8, 9 తరగతుల విద్యార్థినీ, విద్యార్థులతో వినియోగదారుల క్లబ్బులు ఏర్పటు చేస్తున్నామని వారు వివరించారు. ఫలితంగా చట్టాలు, హక్కులను పరిరక్షించడానికి బాధితులకు న్యాయం కోరే అవకాశాలు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కె.రమేష్, జె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జీవో నంబరు-3 పునరుద్ధరణకు ప్రభుత్వం కృషిచేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ

చింతపల్లి, జూలై 8: ఆదివాసీ నిరుద్యోగులకు శత శాతం రిజర్వేషన్ కల్పించే జీవో నంబరు-3 పునరుద్ధరణకు కూటమి ప్రభుత్వం కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టి సత్యనారాయణ అన్నారు. సోమవారం గూడెంకొత్తవీధి మండలం రింతాడ పంచాయతీ ఏబులం గ్రామంలో సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చుతూ మెగా డీఎస్సీ ప్రకటించడం సంతోషకరమన్నారు. అయితే గిరిజన నిరుద్యోగ యువత ఎన్నో ఏళ్లగా డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారన్నారు. డీఎస్సీలో ఆదివాసీ యువతకు న్యాయం జరగలంటే జీవో నంబరు-3 అమలు చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. గిరిజన ప్రాంతంలో వైసీపీ ప్రభుత్వ పాలనలో రహదారులు అధ్వానంగా తయారయ్యాయన్నారు. శివారు గిరిజన గ్రామాలకు రహదారుల సదుపాయం లేదన్నారు. కూటమి ప్రభుత్వం గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తూ రహదారుల సమస్యను పరిష్కరించాలని కోరారు. అలాగే గిరిజనులకు పూర్తి స్థాయిలో తాగునీరు అందించేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి పేట్ల పోతురాజు, నాయకులు జర్తా చిన్నబ్బాయి, దేశగిరి కృష్ణపడాల్, కె.సత్తిబాబు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మెనూ అమలులో నిర్లక్ష్యాన్ని సహించం

ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి, జూలై 8: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ, కేజీబీవీ పాఠశాలల్లో మెనూ అమలు చేయడంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. ఎంపీడీవో చింతపల్లి ఏటీడబ్ల్యూవో నాగ జయలక్ష్మితో కలిసి కస్తూర్బాగాంధీ పాఠశాలను సోమవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల ప్రగతి, భోజనాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో ఎంపీడీవో మాట్లాడుతూ మెనూ ప్రకారం రుచికరమైన, నాణ్యమైన భోజనాలు పెట్టాలన్నారు. మెనూ ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థుల్లో వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆస్పత్రికి తీసుకొని వెళ్లాలని, అవసరమైతే మైదాన ప్రాంతాలకు తరలించి మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణుల ఐకావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డీ పాపారావు, ప్రిన్సిపాల్ ఉష పాల్గొన్నారు.

టేకులవీధిలో నీటి పథకం ప్రారంభం

చింతపల్లి, జూలై 8: మండలంలోని చౌడుపల్లి పంచాయతీలో రూ.3 లక్షల పంచాయతీ నిధులతో నిర్మించిన రక్షిత నీటి పథకాన్ని సర్పంచ్ లలిత ప్రారంభించారు. స్థానిక గిరిజనులు కొన్నేల్లుగా మంచినీటి కోసం ఇబ్బంది పడుతున్నారని, పంచాయతీ నిధులతో రక్షిత నీటి పథకం నిర్మించి వీధి కొలాయిలు ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా సర్పంచ్ చెప్పారు. రక్షిత నీటి పథకం ప్రారంభం కావడంతో నీటి కష్టాలు తీరాయని ఆదివాసీలు హర్షం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో అభ్యుదయ రైతు కరుణానిధి పాల్గొన్నారు.

పీఎం జీవన యోజన బీమా పథకాలను వినియోగించుకోండి

కొయ్యూరు, జూలై 8: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ద్వారా అందిస్తున్న వివిధ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కొయ్యూరు ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్ సతీష్‌కుమార్ కోరారు. మండలంలోని మంప పంచాయతీ కించువానిపాలెం గ్రామానికి చెందిన కంకిపాటి చంద్రశేఖర్ భార్య సరస్వతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో నామిని చంద్రశేఖర్‌కు సోమవారం రూ.2 లక్షల పీఎం జీవనజ్యోతి యోజన పథకం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేనేజర్ మాట్లాడుతూ రూ.436 ప్రీమియం చెల్లిస్తే సాధారణ మరణానికి ఈ పథకం కింద రూ.2 లక్షలు బీమా అందజేయడం జరుతుందన్నారు. అలాగే ఏడాదికి కేవలం రూ.20 చెల్లిస్తే పీఎం సురక్ష యోజన పథకం కింద రూ.2 లక్షలు అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో క్యాషియర్ మురళీకృష్ణ, వినియోగదారులు పాల్గొన్నారు.